

పత్రాలు లేని వాహనాల సీజ్

సరైన పత్రాలు లేకుండా రోడ్లపైకి వచ్చే వాహనాలను సీజ్ చేస్తామని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. 8లో▸



పెండింగ్ వేతనాలు..

ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. 8లో▸



నిండుకుండల్లా చెరువులు

ఇటీవల కురిసిన ఎడతెరపి లేని వర్షాలకు దుద్యాల్ మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

పెరుగుతున్న పెసర ధర



పెసర కొనుగోలు బీట్లలో పాల్గొన్న వ్యాపారులు

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో వారం వారం పెసర ధరలు పెరుగుతూ వస్తున్నారు. మొదటి వారం క్వింటాలుకు రూ.7,300, రెండో వారంలో రూ.7,600 ధర పలకగా ఈ వారం క్వింటాలుకు రూ.8 వేలు ధర పలికింది. ప్రభుత్వ నిర్ణీత ధర రూ.8,550 ఉందని, ఇంకా ధర పెరగాల్సి ఉందని రైతులు తెలిపారు. ఈ వారం మార్కెట్‌కు 292 సంచుల పెసర వచ్చిందని మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు.

కర్ణాటక సీఎంతో ఎంపీ మల్లురవి భేటీ



సీఎం సిద్ధరామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను శనివారం బెంగళూరులో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ఆయనకు వివరించారు.

మంత్రి తుమ్మలను కలిసిన టెస్కాబ్ వైస్ చైర్మన్



మంత్రి తుమ్మలతో కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావును టెస్కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శనివారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రైతు రుణమాఫీ అమలు గురించి మంత్రితో చర్చించినట్లు సత్తయ్య తెలిపారు. మాఫీ అయిన ప్రతి రైతుకు తిరిగి రుణాలను అందిస్తున్నామని, రుణమాఫీ కానటువంటి రైతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తించేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.

కంటైనర్ ఢీ కొని బాలుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవేందర్‌సాయి

అబ్దుల్లాపూర్‌మెట్: అతివేగంగా వచ్చిన కంటైనర్ వెనకనుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం నంబూరుకు చెందిన కొండ దేవందర్ సాయి(19) తల్లిదండ్రులతో కలిసి మజీద్‌పూర్ గ్రామంలో ఉంటూ చైతన్యపురిలోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం చైతన్యపురి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి దాటిన తర్వాత మయూరి కాంట వద్ద యూ టర్న్ వద్దకు రాగానే హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఓ కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో దేవేందర్‌సాయికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

కొత్తూరు: ఓ పరిశ్రమలోనికి వెళ్లే విషయమై సెక్యూరిటీ గార్డుతో నెలకొన్న వివాదంలో శనివారం కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన దేవేందర్‌యాదవ్, తిమ్మాపూర్‌కు చెందిన శ్రీనివాస్, డ్రైవర్ లక్ష్మణ్‌తో కలిసి తిమ్మాపూర్ శివారులోని రాడికో ఖైతాన్ పరిశ్రమ వద్దకు వెళ్లారు. ఓ విషయమై మాట్లేందుకు మేనేజర్‌ను కలుస్తామని సెక్యూరిటీ గార్డును కోరారు. గేటు తీయాలని అడిగగా నిరాకరించడంతో అతనితో ఘర్షణకు దిగారు.



ఒకే వేదికపై విశ్వనాథం, మారుతీరావు, కేధార్‌నాథ్ ఇంద్రజాల ప్రదర్శన

మూడు తరాల ఇంద్రజాలం

ఇంద్రజాలం అంటేనే కనికట్టు. కళ్ల ముందు మాయ.. వీక్షకులను ఆశ్చర్యానికి గురిచేసి కట్టిపడేసే కళ.. పూర్వకాలం నుంచే ప్రాచుర్యంలో ఉంది. 64 కళల్లో ఇంద్రజాలం ఒకటి. దేశంలో అంతరించి పోతున్న ఈ కళకు అక్కడక్కడ కొందరు ఊపిరి పోస్తున్నారు. ఆ కోవలోకే వస్తారు యాలాల మండల కేంద్రానికి చెందిన జ్యోషి విశ్వనాథం. ఈ కుటుంబంలోని మూడు తరాల వారు ఇంద్రజాల కళను వారసత్వంగా కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

వివరాలు 8వ పేజీలో▸

వరిపై గురి



దోమ మండలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు, కూలీలు

రికార్డు స్థాయిలో పంట సాగు

- చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటమే కారణం
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93వేల ఎకరాలు
- ఇప్పటికే 1,30,000 ఎకరాల్లో పంటలు
- మరింత పెరిగే అవకాశం
- శాస్త్రీయ పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

వికారాబాద్: ఈ ఏడాది వరి సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలకు మించి రికార్డు స్థాయిలో సాగవుతోంది. ఇప్పటికే సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు దాటి 1,30,000 ఎకరాలకు చేరుకుంది. నెల రోజులుగా వరినాట్లు వేసుకునే పనిలో రైతన్న బిజీగా ఉన్నాడు. ఇటీవలి ఎడతెరపి లేని వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరింది. పరిగి, కొడంగల్, వికారాబాద్, ధారూరు, కోట్‌పల్లి, తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల్లో అత్యధికంగా వరి నాట్లు వేశారు.

కొనసాగుతున్న వరి నాట్లు

జిల్లాలో వరినాట్లు కొనసాగుతున్నాయి. పరిగి వ్యవసాయ డివిజన్‌లో 46,876 ఎకరాల్లో వరి పంట వేశారు. కొడంగల్ డివిజన్‌లో 45,137 ఎకరాల్లో, తాండూరు డివిజన్‌లో 29,964 ఎకరాల్లో, వికారాబాద్ డివిజన్‌లో 8,023 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా 12 మండలాల్లో వెయ్యి నుంచి ఐదు వేల ఎకరాల్లో వరి పంట వేశారు.

కలిసొచ్చిన వానలు

సీజన్ ప్రారంభంలో వర్షాలు పడ్డా చెరువుల్లోకి నీరు చేరలేదు. ఇటీవల కురిసిన అధిక వర్షాలు వరి సాగుకు కలిసొచ్చింది. జిల్లాలో సాధారణ వర్షపాతాన్ని మించి నమోదు కావడంతో చెరువులన్నీ నిండు కుండల్లా మారాయి. అలుగులు పారుతున్నాయి. జూన్ మొదటి వారంలో 521 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా ఇప్పటి వరకు 766 మిల్లీ మీటర్ల నమోదైంది. జిల్లాలో 1,179 చెరువులు ఉండగా దాదాపు నిండాయి. 800 చెరువులు అలుగు పారుతున్నాయి. జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి.

> **మెలకువలు పాటించాలి**
>
> ఈ ఏడాది అధిక వర్షాలతో వరిసాగు విస్తీర్ణం గణనీయం పెరిగింది. చెరువుల, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటమే ఇందుకు కారణం. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడటం మంచిది కాదు. దాని వల్ల లాభాలకంటే అనర్థాలే ఎక్కువ. ప్రస్తుత సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం.
>
> – మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న బాలమల్లేష్

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్

తాండూరు టౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ బాలమల్లేష్ అన్నారు. శనివారం తాండూరులో నిర్వహించిన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పెత్తందారులకు వ్యతిరేకంగా ప్రజలు నిర్వహించిన సాయుధ రైతాంగ పోరాటాన్ని, కేవలం హిందూ, ముస్లింలకు మధ్య జరిగిన పోరాటంగా చరిత్రను బీజేపీ వక్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మగ్దుం మొయినొద్దీన్, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి యోధులు కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారేనని గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో వారి రక్తతర్పణంతో వేలాది మంది ప్రాణత్యాగాల అనంతరం తెలంగాణ ప్రాంతం రాచరిక పాలన నుంచి విముక్తి పొందిందన్నారు. ప్రభుత్వాలు సెప్టెంబర్ 17 సంబరాలపై కపట నాటకాలు ఆడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్పించాలన్నారు. నేటి తరానికి పోరాటం, త్యాగం, నిజాయితీ, స్ఫూర్తి వంటివి తెలియాలంటే ఇలాంటి చరిత్రను వారికి నేర్పించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు బషీర్ అహ్మద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్, పీర్ మహ్మద్, అనంతయ్య, మునీర్, వెంకటేష్, అబ్దుల్లా, నసీమాబేగం, పున్నెమ్మ, సురేష్, బిచ్చన్న, రాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. అస్తిపంజరమై

- పొలానికి వెళ్లిన వృద్ధుడి మృతి
- గత నెల 29న మిస్సింగ్ కేసు నమోదు
- పరిగి ఆస్పత్రిలో అస్తిపంజరానికి పోస్టుమార్టం



గోబ్ర్యానాయక్

కుల్కచర్ల: పొలానికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమవగా.. చెరువు వద్ద ఉన్న పాటుకాలువలో శనివారం అస్తిపంజరంగా కనిపించాడు. ఈ ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుపాకులతండా అనుబంధ గ్రామమైన గండిచెరువుకు చెందిన గోబ్ర్యానాయక్ (70) గత నెల 29న పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి.. తిరిగి రాలేదు. చీకటి పడినా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికి, బంధువులు, తెలిసిన వారిని వాకబు చేశారు. అయినా ఆచూకీ దొరకలేదు. దీంతో 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా శనివారం చెరువు పరిసర ప్రాంతాల్లో పశువులు మేపుతున్న వారికి దుర్వాసన రావడంతో బండరాళ్ల వద్దకు వెళ్లి చూడగా అస్తి పంజరం కనిపించింది. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయగా వారు వచ్చి అస్తి పంజరాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదిలా ఉండగా వృద్ధుడి మృతి కొంత అనుమానాస్పదంగా ఉందనే చర్చ జరుగుతోంది. గోబ్ర్యానాయక్ భార్య, కొడుకు చనిపోగా, కోడలు, మనవడు ఉన్నారు. అదృశ్యం, ప్రమాదంగా ఫిర్యాదు అందిన నేపథ్యంలో కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత కేసును ముందుకు తీసుకెళ్తామని ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు.



వినాయకుడి సన్నిధిలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

భక్తిమార్గం అలవర్చుకోవాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని, భక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం కొంత సేపు దేవుని సన్నిధిలో గడిపితే మనస్సు తేలికగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్‌యాదవ్, రాములు యాదవ్, ఉప్పరి నాగేశ్, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రామేశ్వర్, పట్లూర్ మాజీ ఎంపీటీసీలు మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వాల దృష్టి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: పేదల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కిషన్‌నగర్ సబ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్య మేళా శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల ఆరోగ్యంపై దృష్టిసారించాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. గ్రామాల్లో బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులను గుర్తించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆరోగ్య భద్రత కార్డులను జారీ చేస్తోందన్నారు. ఈ పథకం కింద పేదలకు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తోందని వివరించారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ దివస్ వేడుకలో విద్యార్థులు, టీచర్లు

కడ్తాల్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఓ అనిత, హిందీ ఉపాధ్యాయురాలు బాలమణి మాట్లాడుతూ.. హిందీ జాతీయ భాషయని.. ఇది నేర్చుకుంటే దేశంలో ఎక్కడకు వెళ్లినా మాట్లాడేందుకు సులువుగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతను తెలిపేలా చార్టులు, డ్రాయింగ్‌లు, పాటలు, ఉపన్యాసాలు, నృత్యాలు, కళాప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం

- ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- యాచారం ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

యాచారం: వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ శశాంక అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి మొత్తం కలియతిరిగారు. వైద్య సేవలు అందించే గది, రక్త పరీక్షలు చేసే గది, గర్భిణులు, బాలింతలకు సేవలందించే గదులను పరిశీలించారు. ఆస్పత్రికి నిత్యం ఎంత మంది రోగులు వస్తున్నారు.. వైద్యం ఎలా అందిస్తున్నారు.. ఆస్పత్రికి వచ్చే రోగులకు సరిపడా మందులు ఉన్నాయా.. అని ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్యులు ఉండడం లేదని, ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వైద్యులు పద్ధతి మార్చుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డెంగీ, మలేరియా తదితర రోగ నిర్ధారణల కోసం అవసరమైన యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాలు కురిస్తే ఆస్పత్రి భవనం పూర్తిగా ఉరుస్తున్న విషయం, పైపెచ్చులు ఊడిపోతున్న సంఘటనలను వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవనాన్ని నిర్మించే వరకు ఆలస్యమవుతుందని, ఆలోపు ప్రస్తుతం ఉన్న భవనాన్నే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని, నివేదిక పంపిస్తే అవసరమైన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తెలంగాణ వైద్యవిధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ రాజు, జిల్లా ఉప వైద్యాధికారి సుధామాధురి, పలువురు వైద్యులు ఉన్నారు.



యాచారంలోని ఆరోగ్య కేంద్రంలో సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శశాంక

ఎడాపెడా తిరస్కరణ!

ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ఇష్టారాజ్యం

- క్షేత్రస్థాయి రిపోర్టులు రాకముందే రిజెక్ట్ చేస్తున్న వైనం
- 36 వేల అప్లికేషన్లలో ఆమోదం పొందినవి చాలా తక్కువే..
- తిరస్కరణకు కారణాలు చెప్పాల్సిందిగా కోరుతున్న బాధితులు
- సమాధానం చెప్పలేక తలలుపట్టుకుంటున్న తహసీల్దార్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌లో యాచారం మండల పరిధిలో 2,555 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో మేడిపల్లి, కుర్మిద్దలోనే వెయ్యికిపైగా ఉన్నాయి. కనీస కారణం చూపకుండానే అధికారులు ఏకపక్షంగా ఆయా దరఖాస్తులన్నీ రిజెక్ట్ చేశారు. తమ అర్జీలను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో స్పష్టం చేయాల్సిందిగా కోరుతూ పలువురు భూ బాధితులు ఇటీవల సంబంధిత రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా వారి నుంచి కనీస స్పందన రాలేదు. ఇలా ఒక్క కుర్మిద్ద, మేడిపల్లి నుంచే కాదు జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌కు అందిన దరఖాస్తుల్లో 80 శాతానికిపైగా ఏకపక్షంగా తిరస్కరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆన్‌లైన్ పోర్టల్‌లో పేరుకుపోయిన పెండింగ్ జాబితాను తగ్గించి చూపే క్రమంలోనే అధికారులు ఈ వక్రమార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. ఇప్పటికే అధికారుల తీరుతో తీవ్రంగా నష్టపోయిన బాధితులు తాజా చర్యలతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.



తహసీల్దార్లకు మౌఖిక ఆదేశాలు

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్‌కు జూలై చివరి నాటికి 36,463 దరఖాస్తులు చేరాయి. వీటిలో ఎస్‌ఆర్‌ఐ పీపీబీ 87, కోర్టు కేసు ఇంటిమేషన్స్ 3,576, కోర్టు కేసు పీపీబీ 1,670, డేటా కరెక్షన్ 15,875, జీపీఏ 153, నిషేధిత జాబిత 7,153, ఇష్యూ ఆఫ్ పీపీబీ/నాలా 481, ఖాతా మెర్జింగ్ 26, లాండ్ మేటర్ గ్రీవెన్స్ 1,687, నాలా డబ్ల్యూఓ పీపీబీ 328, ఆర్గనైజేషన్ పీపీబీ 07, పెండింగ్ మ్యూటేషన్స్ 3,438, సక్సేషన్ 1,381, అర్బన్ లాండ్ 601 పెండింగ్‌లో ఉన్నాయి. 30,026 దరఖాస్తులు తహసీల్దార్ల వద్ద, 5,024 ఆర్డీఓల వద్ద, 1,038 అదనపు కలెక్టర్ వద్ద, 375 కలెక్టర్ లాగిన్‌లో ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిందిగా ప్రభుత్వంలోని పెద్దలు, సీసీఎల్‌ఏ ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కూడా తహసీల్దార్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో పెండింగ్ జాబితా పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని క్షేత్రస్థాయిలోని తహసీల్దార్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. క్షేత్రస్థాయి నుంచి నివేదికలు అందకపోయినప్పటికీ.. దరఖాస్తులను క్లియర్ చేయాలనే తపనతో వాటిని పరిశీలించకుండానే ఎడాపెడా తిరస్కరిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా బాధితుడు వచ్చి తమ దరఖాస్తును ఎందుకు రిజెక్ట్ చేశారో చెప్పాల్సిందిగా కోరితే సరైన సమాధానం చెప్పడం లేదు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని చెప్పి తప్పించుకుంటుండటం కొసమెరుపు.

> **ఏడాదైనా పరిష్కరించలే..**
>
> రాందాస్‌పల్లి సర్వే నంబర్ 41లో నాకు 3.20 ఎకరాల పట్టా భూమి ఉంది. కారణం చూపకుండానే నిషేధిత జాబితాలో చేర్చారు. దీన్ని తొలగించాల్సిందిగా కోరుతూ ఏడాది క్రితం ఆన్‌లైన్ పోర్టల్‌లో కలెక్టర్‌కు దరఖాస్తు చేశాను. తహసీల్దార్ ఆఫీసుకు వెళ్తే...ఆర్డీఓ ఆఫీసుకు వెళ్లమని, తీరా అక్కడికి వెళ్తే..కలెక్టరేట్‌కు వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. ఇప్పటికే 25 సార్లు ఆయా అధికారుల చుట్టూ తిరిగి నా ఫలితం లేదు.
>
> – పాతూరి ప్రకాష్

> **సమాధానం చెప్పడం లేదు**
>
> ఇబ్రహీంపట్నం మండలంలో 2.20 ఎకరాల వారసత్వ భూమి ఉంది. పట్టా భూమిని నిషేధిత జాబితాలో చేర్చారు. తొలగించాల్సిందిగా కోరుతూ రెండేళ్ల క్రితం ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాను. సమస్యకు పరిష్కారం చూపకపోగా, దరఖాస్తును తిరస్కరించారు. ఎందుకు తిరస్కరించారో? కారణం చెప్పాల్సిందిగా కోరుతూ స్థానిక అధికారులను ప్రశ్నిస్తే..వారి నుంచి సరైన సమాధానం లేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఉచిత సలహా ఇస్తున్నారు.
>
> – వెంకటేశ్

క్లుప్తంగా

పేకాట రాయుళ్ల అరెస్ట్‌


పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు

పెద్దేముల్‌: మండలంలోని తట్టేపల్లి శివారులో పేకాట స్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్‌, పెద్దేముల్‌ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.13,880 స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు. గ్రామానికి చెందిన ఎండీ ఇమ్రాన్‌, నరేష్‌, అంజప్ప, ఎండీ కలీం, నర్సింలు, రాథోడ్‌ శంకర్‌, కేథావత్‌ మారుతి తోపాటు మరి కొందరు పేకాట అడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. పేకాట స్థావరంపై దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

పెద్ద చెరువులో మహిళ మృతదేహం

- స్థానికురాలు కప్పాటి మంజులగా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన ఎస్‌ఐ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: పెద్ద చెరువులో శనివారం ఓ మహిళ మృతదేహం బయటపడింది. ఈమె ఇబ్రహీంపట్నంకు చెందిన కప్పటి మంజులగా పోలీసులు గుర్తించారు. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన మంజుల శుక్రవారం చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. అమె భర్త పున్నయ్య రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కొడుకుల్లో పెద్ద కుమారుడికి వివాహం జరిగింది. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం ఇంట్లో జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన మంజుల ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పది రోజుల్లో ఐదుగురి మృతి

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు బలవన్మరణాలకు నిలయంగా మారుతోంది. గడిచిన పది రోజుల్లో ఈ చెరువులో దూకి ఐదుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గత 5న ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకింది. 8న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తాజాగా మంజుల బాడీ తేలడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చెరువు వద్ద ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పరామర్శ

కొత్తూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు కడెంపల్లి సదానంద్‌గౌడ్‌ అన్న కుమారుడు కడెంపల్లి శ్రీధర్‌గౌడ్‌ కుటుంబాన్ని శనివారం ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని వారికి ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి,నాగరాజుచారి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌, మోహన్‌సింగ్‌, గోవర్ధన్‌గౌడ్‌, సుధాకర్‌, అరవింద్‌ పాల్గొన్నారు.

డీజేలు సీజ్‌

చేవెళ్ల: మండలంలో మూడు వినాయక మండపాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించిన డీజేలను సీజ్‌ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్‌ తెలిపారు. మండల కేంద్రంలోని మూడు కాలనీల్లో శుక్రవారం రాత్రి మండపాల వద్ద డీజేలు వినియోగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మూడు కాలనీల్లో మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులైన పామెన గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌కు చెందిన పాడ్‌ బ్యాండ్‌, ఏట్ల ఎర్రవల్లికి చెందిన మామిడిపల్లి రాజుకు చెందిన డీజేకు సంబంధించిన స్టూడియో మా స్టర్‌ మిక్సర్‌, చేవెళ్లకు చెందిన విష్ణు దగ్గర డీజేకి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మూడు తరాల ఇంద్రజాలం!

ఒకే వేదికపై తాత, తండ్రి, మనవడి ప్రదర్శన

- దేశంలోని అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో ఈ వెంట్లు
- అర్చకత్వం, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, మెజీషియన్‌గా త్రి పాత్రాభినయం చేసిన విశ్వనాథం
- ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం



తాండూరు: యాలాల మండల కేంద్రానికి చెందిన విశ్వనాథం స్థానిక జ్యోషి దేవాలయంలో అర్చకుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా(రిటైర్డ్‌), మెజిషియన్‌గా త్రి పాత్రాభినయం చేస్తున్నారు. చదువుకునే రోజుల్లోనే ఇంద్రజాల కళపై మక్కువ పెంచుకున్నారు. ప్రముఖ ఇంద్రజాల మంత్రికుడు బీవీ పట్టాభి రామన్‌ వద్ద శిష్యుడిగా చేరి విద్య నేర్చుకున్నారు. నాలుగు దశాబ్దాల పాటు 5 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి వేలాది మందిని మంత్ర ముగ్ధులను చేశారు. ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు. విశ్వనాథం వారసులుగా కొడుకు జ్యోషి మారుతీరావు, మనవడు కేధార్‌నాథ్‌ జ్యోషి ఈ రంగంలో రాణిస్తున్నారు. వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇస్తూ అబ్బుర పరుస్తున్నారు.

మ్యాజిక్‌తో మెప్పిస్తున్న కేధార్‌నాథ్‌

ఇంద్రజాల ప్రదర్శనలో జ్యోషి కేధార్‌నాథ్‌ మెప్పిస్తున్నారు. గతంలో గుంటూరులో జరిగిన ఇంద్రజాల మహోత్సవంలో పాల్గొని ప్రథమ బహుమతి అందుకున్నారు. తాత విశ్వనాథం వద్ద మెలకువలు నేర్చుకున్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని బైక్‌పై అయోధ్యకు బయలుదేరిన మారుతీరావు

ఒకే వేదికపై ముగ్గురు

గతేడాది హైదరాబాద్‌ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇంద్రజాల ప్రదర్శన ఇచ్చారు. ఒకే వేదికపై తాత, కొడుకు, మనవడు ప్రదర్శనను ఇచ్చి ప్రేక్షకులను మురిపించారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అనేక గ్రామాల్లో మూఢ నమ్మకాల బారిన పడకుండా ప్రజలను ఇంద్రజాల ప్రదర్శనతో చైతన్యం చేశారు.



పురస్కారం అందుకుంటున్న తాత, కొడుకు, మనవడు

చివరి కోరిక తీర్చిన మారుతి

విశ్వనాథం కుమారుడు జ్యోషి మారుతీరావు బ్యాంక్‌ ఉద్యోగి. తెలుగు, కన్నడ, హిందీ, మరాఠీ, ఇంగ్లిష్‌ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరు. తండ్రి నుంచి ఇంద్రజాల విద్యను అందిపుచ్చుకొని ప్రదర్శనలు ఇస్తున్నారు. మూడు దశాబ్దాల్లో నాలుగు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ఔరా అనిపించుకున్నారు. క్యాన్సర్‌ వ్యాధి బారిన పడి చివరి దశలో ఉన్న మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన 11 ఏళ్ల బాలుడు వెంకట్‌ ఇంద్రజాల ప్రదర్శన చూడాలనుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మారుతీరావు బాలుడు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి ప్రదర్శన ఇచ్చి సంతోష పెట్టాడు. చివరి కోర్కె తీర్చాడు. కార్గిల్‌ యుద్ధ సమయంలో, వరద బాధితుల కోసం, దివ్యాంగుల కోసం ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చి విరాళాలు సేకరించి ఆర్థిక సాయం అందించారు. అయోధ్య రామ మందిరం చూడటానికి ద్విచక్ర వాహనంపై కళ్లకు గంతలు కట్టుకొని 1,600 కిలోమీటర్లు ప్రయాణం చేశారు.


ఆస్పత్రిలో బాలుడి వద్ద ఇంద్రజాల ప్రదర్శన ఇస్తున్న జ్యోషి మారుతీరావు


పూడూరు: సీజ్‌ చేసిన వాహనాలతో పోలీసులు

పత్రాలు లేని వాహనాలు సీజ్‌

పూడూరు: సరైన పత్రాలు లేకుండా రోడ్లపైకి వచ్చే వాహనాలను సీజ్‌ చేస్తామని చన్గోముల్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని మన్నేగుడలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ఎనిమిది వాహనాలను సీజ్‌ చేశారు. నంబర్‌ ప్లేట్లు లేని వాహనాలకు జరిమానా విధించారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉన్న వారు మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. మద్యం తాగి బండి నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు.

జరిమానా విధింపు

తాండూరు టౌన్‌: తాండూరులోని ఇందిరా చౌక్‌ వద్ద పట్టణ సీఐ సంతోష్‌ కుమార్‌ ఆధ్వర్యంలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. నంబర్‌ ప్లేట్లు లేని వాహనాలకు ప్లేట్లు పెట్టించారు. 16 వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌, వాహన రిజిస్ట్రేషన్‌ పత్రాలు, హెల్మెట్‌ లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్‌: ప్రతి వాహనానికి నంబర్‌ ప్లేట్‌ ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని పెద్దేముల్‌ ఎస్‌ఐ గిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్‌ ప్లేట్లు లేని ఎనిమిది వాహనాలకు జరిమానా విధించారు. పిల్లలకు వాహనం ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బక్కప్ప, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.


హిందీ దివస్‌ వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా హిందీ దివస్‌

కడ్తాల్‌: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో హిందీ దివస్‌ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఓ అనిత, హిందీ ఉపాధ్యాయురాలు బాలమణి మాట్లాడుతూ.. హిందీ జాతీయ భాషయని.. ఇది నేర్చుకుంటే దేశంలో ఎక్కడకు వెళ్లినా మాట్లాడేందుకు సులువుగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతను తెలిపేలా చార్ట్‌లు, డ్రాయింగ్‌లు, పాటలు, ఉపన్యాసాలు, నృత్యాలు, కళాప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వాల దృష్టి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి
- కిషన్‌నగర్‌లో ఆరోగ్య మేళా సందర్శన

షాద్‌నగర్‌: పేదల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కిషన్‌నగర్‌ సబ్‌ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్య మేళా శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల ఆరోగ్యంపై దృష్టిసారించాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. గ్రామాల్లో బీపీ, షుగర్‌ వ్యాధి గ్రస్తులను గుర్తించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయుష్మాన్‌ భారత్‌ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆరోగ్య భద్రత కార్డులను జారీ చేస్తోందన్నారు. ఈ పథకం కింద పేదలకు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తోందని వివరించారు. ఆరోగ్య మేళాలో శనివారం 98 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ జగదీశ్వర్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు సుగుణ, వెంకటమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ విజయలక్ష్మి

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్‌రూరల్‌: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్‌ చేశారు. మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్‌, ఔట్‌ సోర్సింగ్‌ కార్మికులు ఆస్పత్రి ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని కమ్యూనిటీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెల రూ.11వేల వేతనం ఇస్తున్నారన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి మాత్రం ప్రతి నెల రూ.10వేలు మాత్రమే ఇస్తూ వేయి రూపాయలు ఎందుకు తగ్గించి ఇస్తున్నారని ప్రశ్నించారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో మెడికల్‌, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతినెల సకాలంలో వేతనాలు వచ్చే విధంగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న మెడికల్‌, ఔట్‌సోర్సింగ్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించని యెడల కార్మికుల పక్షాన సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్‌, వేమారెడ్డి, మల్లేశ్‌, పద్మ, సుజాత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజా ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌ పాలన

- పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్‌రూరల్‌: ప్రజల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం నర్సింహారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు అజీజ్‌నగర్‌ కొత్త జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లి నర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించి కేక్‌ తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ద్వారా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అందరూ సహకరిద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌, చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్‌, ఫిషర్‌మెన్‌ జిల్లా చైర్మన్‌ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్‌, మండల అధ్యక్షుడు మాణయ్య, నాయకులు మర్రి రవీందర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న జైపాల్‌రెడ్డి తదితరులు

గురుకులాల సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు ఎంజేపీజీ ఆర్‌సీఓ యాదయ్యగౌడ్‌ వినతి

షాద్‌నగర్‌రూరల్‌: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల(ఎంజేపీజీ) పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఎంజేపీజీ ఆర్‌సీఓ యాదయ్యగౌడ్‌ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికై న ఎమ్మెల్యేను ఆర్‌సీఓ యాదయ్యగౌడ్‌ చటాన్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ ప్రీతి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, కొన్ని పాఠశాలలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు కష్టాలు పడుతున్నారన్నారు.

చింతల.. భళా


ఇటీవల రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకుంటున్న డాక్టర్‌ రాకేశ్‌ భవాని

చిన్ననాటి నుంచే మాతృ భాషపై మమకారం


వచ్చిన అవార్డులు, పురస్కారాలతో రాకేశ్‌భవాని

- ఇంజనీరింగ్‌ పూర్తి చేసినా అటువైపే మొగ్గు
- కవిగా, రచయితగా, అధ్యాపకుడిగా, సామాజికవేత్తగా పలు రంగాల్లో రాణింపు
- సేవకు వరించిన అవార్డులెన్నో..
- తాజాగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా పురస్కారం
- బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు
- తెలుగుభాషను కాపాడటమే లక్ష్యమంటున్న రాకేశ్‌ భవాని

ఇబ్రహీంపట్నంరూరల్‌: 'దేశభాషలందు తెలుగులెస్స' అన్నారు. అలాంటి కమ్మనైన మాతృ భాషను కాపాడటానికి కంకణం కట్టుకున్నారు ఓ కవి/రచయిత/అధ్యాపకుడు. ఇంజనీరింగ్‌ విద్యనభ్యసించినప్పటికీ తెలుగు భాషపై అపారమైన మమకారం పెంచుకున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించారు. సాహిత్య, సామాజిక రంగాల్లో తన కుంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. 2024 సంవత్సరానికి ఇటీవల ఏకంగా జిల్లా నుంచి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా పురస్కారం అందుకున్నారు. అతడే డాక్టర్‌ చింతల రాకేశ్‌భవాని. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన సాధించిన విజయాలు, సొంతం చేసుకున్న అవార్డులకు లెక్కే లేదు. బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్‌ చింతల రాకేశ్‌ భవానిపై ప్రత్యేక కథనం

చిన్నతనం నుంచే తెలుగుపై మక్కువ..

చింతల రాకేశ్‌భవాని స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌ మండలం ఎంకిర్యాల. తండ్రి యాదయ్య ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా పని చేసి ఎంతో మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. రాకేశ్‌భవాని ఎల్బీనగర్‌లోని తక్షశిల హైస్కూల్‌లో 1 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్‌ ఎంపీసీ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీఎల్‌ జూనియర్‌ కళాశాలలో చదివారు.. 1 నుంచి 6వ తరగతి చదువుతున్నప్పుడే ఆదివారం వివిధ దిన పత్రికల్లో వచ్చే అనుబంధాలకు లేఖలు, కవితలు రాసే అలవాటు ఉండేది. ఇంజనీరింగ్‌ ఈసీఈ విభాగం వాసవి కళాశాలలో పూర్తి చేశాడు. పీజీ ఎంట్రెన్స్‌ తెలుగులో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 2వ ర్యాంకు, పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌లో 3వ ర్యాంకు సాధించాడు. ఎంఏ తెలుగు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి మొదటి శ్రేణిలో పూర్తి చేశాడు. యుజీసీ నెట్‌ పరీక్షలో తెలుగు సబ్జెక్ట్‌లో నెట్‌, జేఆర్‌ఎఫ్‌ సాధించాడు. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో ఓపెన్‌ కేటగిరీలో డిగ్రీ అధ్యాపకుడిగా ఎంపికయ్యాడు. విశాఖ సబ్బవరం, నల్లగొండ జిల్లా రామన్నపేట, హయత్‌నగర్‌లో పనిచేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో పని చేస్తున్నారు.

సాహిత్య, సామాజిక రంగాల్లో రాణింపు

'సినీగేయ సాహిత్యం- సమకాలీన సమాజ చిత్రణ' అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 2020లో డాక్టరేట్‌ పొందాడు. కవిగా, అధ్యాపకుడిగా, గాయకుడిగా, రచయితగా, యూనియన్‌ నాయకుడిగా రాణిస్తున్నాడు. పూలదోసిలి, మాఊరు ఇంకా రాలేదు, జలధి, సాహితీ దీపిక అనే రచనలు చేశాడు. జాతీయ సదస్సులు ఆధునిక తెలంగాణ మహాకావ్యాలు-సమాలోచన, తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం-సమాలోచన లాంటి సదస్సులు నిర్వహించాడు. 70కి పైగా పాటలు రచించి పాడారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నాడు. కళాశాల విద్యాశాఖ వారి యవతరంగం కార్యక్రమానికి నల్లగొండ, హైదరాబాద్‌, రంగారెడ్డి క్లస్టర్‌కో ఆర్డినేటర్‌గా, కోవిడ్‌ సమయంలో రంగారెడ్డి జిల్లా ఎన్‌ఎస్‌ నోడల్‌ అధికారిగా, కోవిడ్‌ వారియర్‌గా, కేంద్రప్రభుత్వ క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ నెహ్రూయువకేంద్రం ప్రోగ్రాం అధికారి, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వారికి శిక్షకుడిగా పని చేశారు.

సేవలకు దక్కిన పురస్కారాలెన్నో..

- 2017లో ప్రపంచ హాకవి సమ్మేళనం ప్రతినిధిగా తానా నిర్వహించిన మహాసభలకు భారతదేశం ప్రతినిధిగా నైజీరియా తెలుగుసంఘం తరపున పాల్గొని ప్రశంసలు పొందారు.
- గాంధీ గ్లోబల్‌ ఫ్యామిలీ నుంచి విద్యాశాఖ మంత్రి సబిత చేతుల మీదుగా విద్యాసేవారత్న 2021 పురస్కారం దక్కించుకున్నారు.
- అంబేద్కర్‌ దళితరత్న 2021, కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా 2022కు గాను కాళోజీ విశిష్ట భాషా పురస్కారం, భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా 2022కు గాను ఏపీజే అబ్దుల్‌కలాం ఎంపవర్‌మెంట్‌ పురస్కారం అందుకున్నారు.
- జాతీయస్థాయిలో ఉత్తమ జాతీయ సేవా పథకం క్రీశా ఫౌండేషన్‌ ముంబై వారి నుంచి 2022 కరంవీర పురస్కారం, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం 2022గాను గురు స్పందన పురస్కారం దక్కించుకున్నారు.
- 2023 మాతృభాష దినోత్సవం సందర్భంగా సామాజిక సేవా పురస్కారం, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా ఉత్తమ అధ్యాపక పురస్కారం, సామాజిక సేవా విభాగంలో ఉగాది ప్రతిభ పురస్కారం-2024కు వివిధ ప్రముఖుల నుంచి స్వీకరించారు.

తెలుగుభాషను కాపాడటమే లక్ష్యం

దేశ ఔన్నత్యం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని, తెలుగుభాషను బతికించుకోవాలనేది ఆకాంక్ష. చిరుప్రాయం నుంచే తెలుగు అంటే ఎనలేని ప్రేమ. నా మొట్టమొదటి గురువు మా నాన్న. ఆకలి రాఘవేంద్ర, సావిత్రి ఉపాధ్యాయుల నుంచి ఎంతో నేర్చుకున్నా. పుస్తకపఠనం, మా ఇంట్లో ఉన్న సాహిత్య వాతావరణం నన్ను ఇంతవాన్ని చేసింది. భవిష్యత్తులో సామాజిక, సాహిత్య రంగాలపై అధ్యయనం చేస్తూనే అధ్యాపకుల హక్కులను కాపాడటానికి కృషి చేస్తాను.

– డాక్టర్‌ చింతల రాకేశ్‌ భవాని

